# మానవ ఆరంభమునుండి క్రీస్తువరకు దేవుని రాజ్యము

## ఉపోద్ఘాతము

మూడవ భాగములో, మానవ ప్రారంభం నుండి క్రీస్తునకు పాలనాధికారం ఇచ్చు వరకు గల దేవుని రాజ్యమును గూర్చి ధ్యానించుదము. అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో సంఘ స్థాపనతో దేవుని రాజ్యములోనికి పిల్లలను సమ కూర్చటం ప్రారంభం కాలేదు. పాత నిబంధన వృత్తాంతములలో వివిధ పద్ధతులలో దేవుడు తన రాజ్యమును నిర్వహించినట్లు స్పష్టముగా చూడగలము. "అనేకులు తూర్పు నుండియు పడమటనుండియు వచ్చి అబ్రాహాముతో కూడను, ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను, పరలోకరాజ్యమందు కూర్చుందురు" (మత్తయి 8:11) అని యేసు యూదులకు ప్రకటించాడు. వారు ముగ్గురు ఇంతకు పూర్వమే దానిలో ఉన్నారు, దేవుని సంఘము ద్వారా ఇతరులు దానిలో ప్రవేశిస్తున్నారు (1 కొరింథీ. 8:6). దేవుని సంఘము లేక క్రీస్తు సంఘమును యేసు కడుతున్నాడు అది పరలోక రాజ్యమపు తాళపు చెవులు కలిగియున్నది (మత్తయి 16:17-19). దేవుని రాజ్యము నిత్యమైనదని అపొస్తలుడైన పేతురు అర్థం చేసుకొన్నాడు. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు.

> *అలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహించబడును* 2 పేతురు 1:11.

"నిత్య" అను మాట, ఈ ప్రపంచము సృష్టింపబడక మునుపే, యేసు రాజ్యము ఉనికిలో ఉన్నట్లు సూచించుచున్నది. తత్ఫలితముగా, మనము యేసు రాజ్యమని ఆలోచించినప్పుడు, దేవునిరాజ్యము అని కూడా ఆలోచించవలెను. అవి ఒకే రాజ్యమా? లేక అవి రెండు రాజ్యములా? అని మనం అడుగుతుండవచ్చును. అనేక మంది క్రైస్తవులు, బహుశా, "ఒకే ఒక నిత్యరాజ్యమున్నది" అని చెబుతారు. దేవుని రాజ్యము, యేసు రాజ్యము అను బైబిలులోని ప్రత్యేక పదములను గూర్చి మనమెలా అర్థం చేసుకోవాలి?

రాజ్యము అను మాట: ఒకటి, రాజ్య పాలన లేక సార్వభౌమత్వము; రెండు, పాలించు పరిధిని తెలియజేస్తుంది. దేవుని రాజ్యము లేక పరలోకరాజ్యము పరలోకములో ఎప్పుడూ ఉనికి కలిగి ఉంది, దేవుడెప్పుడూ అక్కడ పరిపాలిస్తూనే ఉన్నాడు. ఇది పరలోక రాజ్యము లేక దేవుని రాజ్యమేగాని, మానవ రాజ్యము లేక భూ సంబంధమైన రాజ్యము కాదు. మత్తయి 6:10లో "నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక" అని యేసు తన ప్రార్థనలో చెప్పాడు. అయితే మూడవ భాగములో మన ఆసక్తి, భూమి మీద లేక మానవ ప్రమేయ దేవుని రాజ్యమునందు మాత్రమే. లోకము పుట్టినది మొదలుకొని విశ్వాసులైన ప్రజల కొరకు సిద్ధపరచబడినదని యేసు చెప్పారు (మత్తయి25:34).

దేవునిరాజ్యమును గూర్చి మత ప్రపంచము పలు రకములైన సిద్ధాంతములను కలిగియున్నది. వాటిలో వెయ్యేళ్ళ పరిపాలన సిద్ధాంతము ప్రసిద్ధమైనదే. యేసు భూమికి తిరిగి వచ్చునప్పుడు తన రాజ్యమును స్థాపించుననియు, ఆయన ఈ భౌతిక లోకములో వెయ్యేళ్ళు పాలించుననియు వారు నమ్ముదురు. సత్యవిరుద్ధమైన ఈ ఊహ (paradoxical postulation)ను చాలామంది అంగీకరించిరి. అనగా, రాజ్యము లేకుండగానే యేసు యిప్పుడు రాజైయున్నాడని వారి నమ్మకము. బహుశః మెస్సీయ కొరకింకను నిరీక్షించే ఆ యూదులు కూడా ఒక భౌతికరాజ్యము కొరకై ఎదురు చూచు చున్నారు. దేవుని రాజ్యముపై యేసు ప్రస్తుతము రాజని నమ్మే మనలోను కొన్ని భిన్న నమ్మకములున్నవి. రాజ్యము అనుమాట సంఘము అనుమాట కంటే అధికముగా యుక్తమై యుండగా రాజ్యము అనుమాట సంఘము అనుమాట మీది అభిమానము కొరకు తరచు తొలగింపబడుచుండుట సుస్పష్టమే!

దేవుని నిత్యరాజ్యము సమీపించియున్నదని, లేక ఇంతకు ముందే ఉంది, ఇంకా గర్భం దాల్చలేదు అని యేసు చెప్పిన సందర్భములో, మానవ సృష్టిలో దేవుని ఉద్దేశం కలిసి ఉంది (మత్తయి 4:17; మార్కు 1:15). యేసు పరిచర్య నాడు, నేడు దేవుని నిత్యరాజ్యము కొరకు మానవులలో నుండి ఆయన కోరిన ఫలాలను పండించి అభివృద్ధి పరచుటకు అంకితం చేయబడినది. అన్ని జాతుల నుండి యేసులాంటి వ్యక్తిత్వములు, గుణలక్షణాలతో దేవునికి పిల్లలు కావాలి (రోమా 9:26). ఈ విధముగా ఇంతకు ముందే ఉంది, ఇంకా గర్భము దాల్చలేదు అను దానిని అర్థం చేసు కొనవచ్చును. దేవుని రాజ్యము నిత్యమైనది, కాబట్టి దానికి ఆది అంతము లేదు. యేసు మరొక రాజ్యమును స్థాపించలేదు. కాబట్టి ఆయన తన రాజ్యమని సూచించినప్పుడు, దేవుని నిత్య రాజ్యము కొరకైన ఫలము ఆయన మనస్సులో ఉండి ఉంటుంది. ఈ ఫలము ఇప్పుడు తన శరీరమైన సంఘములో సిద్ధపరచబడుతూ ఉంది (ఎఫెసీ. 1:22, 23).

యేసు మూల వస్తువులపైన గాని, దేవదూతలు, రాజులు లేక చివరకు సాతాను పై గాని, దేవుని శక్తిని లేక రాజ్యమును స్థాపించుటకు రాలేదు. అవి ఇంతకు ముందే దేవుడు అనుమతించిన స్థాయిలో ఆయన అధికారము క్రింద ఉన్నాయి (1 తిమోతి 6:15,16). ఆకాశము ఆయన సింహాసనము, భూమి ఆయన పాద పీఠము (యెషయా 66:1). యేసు విశ్వాసులైన క్రైస్తవుల పై నుండి సాతాను యొక్క మరణ అధికారమును తీసివేస్తాడు (హెబ్రీ. 2:14,15). దేవుని రాజ్యము సమీపముగా ఉన్నదని యేసు మాట్లాడినప్పుడు, ఆయన యాజకత్వము మరియు రాజరికము యొక్క కృప, దేవుని కొరకు పిల్లలను అభివృద్ధి పరచుటకు ఇవ్వజూపే పరిస్థితి ఆయన మనస్సులో ఉండి ఉంటుంది (యోహాను 1:17; అపొ. కార్య. 5:31). దేవుడు అధికారము ద్వారా పిల్లలను అభివృద్ధిపరచలేడు. ఈ సంగతి తల్లిదండ్రులందరూ బాగుగా ఎరుగగలరు.

నిత్య కుమారులను సమకూర్చి అభివృద్ధిపరచుటపై వక్కాణించుటతో యేసు రాజ్యమే దేవుని రాజ్యము (ఎఫెసీ. 5:5; హెబ్రీ. 2:10). యేసు తన రాజ్యమని మాట్లాడినప్పుడు, దేవుని నిత్య రాజ్యము కొరకు పిల్లలు ఉత్పత్తికాగల, కృప విస్తరించు ఆత్మ సంబంధమైన రాజ్యము ఆయన మనసులో ఉంది (రోమా 5:1-5). ఆయన అపొస్తలుల జీవితకాలములో అది వస్తుందని చెప్పాడు, అది వచ్చినది (మార్కు 9:1). దేవుని సంఘమైన క్రీస్తు శరీరము ద్వారా దేవుని రాజ్యములోనికి మనకు ప్రవేశము అందుబాటులో ఉంది (1 కొరింథీ. 1:2, 3:21-23).

నేడు క్రీస్తునందు దేవుని సంఘ సభ్యులు, శాశ్వత రాజ్యము, నిత్యుడైన రాజు అను దీవెనలతో ఆశీర్వదింపబడినారు (కీర్తన 145:13; 1 థెస్స. 2:14; 1 తిమోతి 1:17). అయినను, యేసు దేవునికి తిరిగి అప్పగించు రాజ్యము తీర్పు తీర్చబడిన క్రీస్తు సంఘము (రోమా 16:16). దయచేసి గమనించండి, యేసు సంఘమును దేవుని యొద్దకు తిరిగి తీసుకువెళతాడు అని అపొస్తలుడైన పౌలు కొరింథీ సంఘమునకు చెప్పలేదు (1 కొరింథీ. 15:24-28). యేసు తన నిత్య రాజ్యమును తిరిగి దేవుని యొద్దకు తీసుకు వెళతాడు; అయితే, దేవుని సృష్టియైన లోకము మరియు మానవ జాతి నుండి తాను కోరుకొనిన ఫలము దానిలో చేర్చబడుతుంది. విశ్వాసులైన క్రైస్తవులైన మన కొరకు ఈ విధముగా ప్రవేశము సిద్ధపరచబడుతుంది. మనము దేవుని రాజ్యమును, నిత్య జీవమును స్వతంత్రించుకొంటాము (యాకోబు 1:12; 2:5) ఈ రాజ్యమే గతంలో ఉన్నది, ఇప్పుడున్నది, ఇక ముందు ఉండబోతుంది.

మూడవ భాగము మొదటి పాఠములో, దేవుడు తన రాజ్యము కొరకు ఫలమును మనస్సులో ఉంచుకొని ఈ విశ్వాన్ని ఎలా సృజించాడో మనం చూడవచ్చును. దేవునిపై మనమాధారపడు విధముగా ఆయన మానవుని సృజించెను. దేవుని చిత్తము అను పరిధిలోనే ఆయన రాజ్యముండునని చూచెదము, అయినను, మానవాళికి దేవుడు స్వేచ్ఛను అనుగ్రహించెను. మన అభీష్టమును నెరవేర్చుకొనుటకు ఆయన స్వయం నిర్ణయవకాశమును ఇచ్చెను. లేకపోతే మనము పిల్లలముగా వర్గీకరింపబడము.

**మానవుని ఆత్మీయస్థితి అతని ఆత్మీయ స్థాయిని నిర్ణయించుననియు, అభిషిక్తుడు భువికేతెంచు వరకును తన రాజ్యమును కొనసాగించుటకు దేవుడెట్టి విధానమునను సరించినదియు ఈ భాగములోని మిగిలిన పాఠములు చూపించును.** ప్రతి సందర్భము లోను తన ప్రజలను పాలించుటయే ఆయన యొక్క గురియైయున్నది, దేవునితో సహవాసములో ఉన్నప్పుడు మనము యుక్తముగా నడుచుకొనగలుగుట కిదియే ఏకైక మార్గము (2 కొరింథీ. 13:14; కొలొస్స. 2:9-12).

అబ్రాహాము మరియు కుటుంబపు ఎన్నిక, మానవుల ఆత్మీయస్థాయిని ఆధారము చేసికొని దేవుడు వ్యవహరించుననుటకు ఉదాహరణము. ప్రారంభములోకంటె తరువాత, తక్కువ పాటి ఆత్మీయస్థాయినిబట్టి వీరితో దేవుడు వ్యవహరించెను. ఆయన మోషేకు అనుగ్రహించిన ధర్మశాస్త్రము మరియు ఇతర నిబంధనల ద్వారా వారిని నడిపింపజూచాడు. క్రీస్తు నొద్దకు వారిని నడిపించునట్లు ఇశ్రాయేలీయుల దైవిక పరిపాలన ధర్మశాస్త్రము ద్వారా అమలు జరుపబడినది. (గలతీ.3:19).

యేసు, ప్రజల స్వభావమును అర్థము చేసుకొనుట కొరకు వారి ప్రవర్తనను ఒక మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞునిగా చదివినట్లు, దేవుడు మరియు మానవుడు, పాత నిబంధన వృత్తాంతములలో సంయుక్తముగా పనిచేస్తున్నారు. కాబట్టి మనం వారి ప్రవర్తనను చదవాలి. ఈ విధముగా ఇరు పక్షాల స్వభావమును మనము కొంత అర్థం చేసు కొనగలము.

పాత నిబంధన వృత్తాంతములు చదువు నియమాలను మనము ఎరిగి యుందాము. దేవుని చేత ఇవ్వబడిన ఈ వృత్తాంతములను మనము ఏక కాలములో మూడు స్థాయిలలో చదవాలి.

1. దేవుని విశ్వప్రణాళిక - ఉచ్ఛ స్థాయి
2. పాత నిబంధన అంతటిలో దేవుని ప్రధాన కదలికలు - మధ్యమ స్థాయి.
3. మనము సాధారణముగా చదివే వ్యక్తిగత వృత్తాంతములు - అథమ స్థాయి.

ప్రతి వ్యక్తిగత వృత్తాంతము, దేవుడు తన నిత్యరాజ్యములోనికి పిల్లలను సమకూర్చు ఆయన చివరి ప్రణాళిక ఎలా నెరవేరుస్తున్నాడో అను దానిని గురించి విస్తృత ఆలోచనా భాగము. "How to read the Bible for all its worth" by Fee and Stuart చూడుము.